# కరెంట్

యువతనే దృష్టిలో ఉంచుకుని తీసిన 'కరెంట్' చిత్రం జూన్ 19న విడుదలైంది. ఈ చిత్రంలో వివిధ అంశాల్ని పరిశీలిస్తే:

**పేరు:** వర్తమానానికే (కరెంట్) ప్రాధాన్యమిచ్చే యువదశనీ, యువ హృదయాలమధ్య ప్రవహించే ప్రేమ కరెంట్‌నీ అన్వయిస్తూ- ఆకర్షణీయమైన, సబబైన కొత్త పేరు.

**కథ:** 'నో వర్రీ ఫర్ టుడే, నో హర్రీ ఫర్ టుమారో' అనే దృక్పథం- శాపమైనా, వరమైనా యువతకి ఆకర్షణీయం- అని చెప్పే ఇతివృత్తం చాలా గొప్పది. ఇలా- బాధ్యతల్ని నిరసించే విలక్షణమైన హీరోతో గతంలో వచ్చిన 'నువ్వే నువ్వే' చిత్రానికి త్రివిక్రమ్ శ్రీనివాస్ అద్భుతమైన కథని సమకూర్చారు. ఇటీవల వచ్చిన రాజు-మహరాజులో శర్వానంద్ పోషించిన పాత్ర కూడా కొంతవరకూ ఇదే టైపు. హీరో సుశాంత్‌కి బాధ్యతలు, నియమాలు, సమయపాలన ఇష్టముండవు. ఐనా ఇంజనీరింగ్ చదివే స్థాయికి ఎదిగాడు. తన క్లాస్‌మేట్ స్నేహ ఉల్లాల్‌ని ప్రేమించి- ఆమెలో తనపట్ల ప్రేమను పుట్టించడాన్ని బాధ్యతగా తీసుకుంటాడు. నియమాలు, సమయపాలన పాటించి- అనుకున్నది సాధిస్తాడు. ఆ ప్రేమ కొనసాగడానికి మాత్రం సమయపాలన కూడా పాటించలేనని ఖచ్చితంగా చెప్పేస్తాడు. తప్పు చేసినవారు తమ తప్పుని తామే సవరించుకోవాలనే స్నేహ- తన మనసులోంచి ప్రేమను తీసేసే బాధ్యత కూడా హీరోదేనంటుంది. బాధ్యత ఇష్టంలేని హీరోకి ఆ బాధ్యత స్వీకరించడానికీ, అందుకు సమయపాలన పాటించడానికీ అభ్యంతరం లేదు. అతడి ప్రయత్నం ఫలించగా- అతడిమీద కోపంతో వేరే పెళ్ళికొప్పుకున్న స్నేహ మంగళసూత్రధారణ సమయందాకా ఆగి- హీరోకోసం పరుగెడుతుంది. అప్పటికి హీరో కూడా తన తప్పు తెలుసుకుని స్నేహ కోసం పరితపిస్తున్నాడు. హీరో హీరోయిన్ల పరంగా కథ సుఖాంతం. ఇది చదివేక మీలో కలిగిన భావం సబబే- ఈ చిత్రంలో కథ నిజంగా పేలవం.

**కథనం:** సన్నివేశాల్లో కొన్ని అనూహ్యం, కొన్ని అనాసక్తం. పాత్రల్లో కొన్ని అసహజం, కొన్ని అసందర్భం. హీరో హీరోయిన్ల మధ్య ప్రేమోద్భవమూ, చివర్లో వాళ్ళు మళ్ళీ ఒకటయ్యే క్లైమాక్సూ కూడా పేలవం. ఐతే మొత్తంమీద కథనమంతా అంత పేలవమనడానికి లేదు.

**దర్శకత్వం:** అడుగడుగునా దర్శకత్వపు ప్రతిభ కనిపించే ఈ చిత్రానికి కథ పెద్ద మైనస్ పాయింటు. ఆ కథను దర్శకుడు సూర్యప్రతాపే సమకూర్చారు కాబట్టి- కథకుడిగా తనే మైనస్ పాయింటయ్యానని ఆయన గ్రహించాలి. హీరో-హీరోయిన్ల కథకంటే- కామెడీ ట్రాక్‌లో బోసు-గీతల ప్రేమ కథ పసందుగా, అర్థవంతంగా ఉండడం గమనార్హం. హీరో, హీరోయిన్ల తలిదండ్రుల పాత్రచిత్రణ హాస్యాస్పదం. హీరో వ్యభిచార నేరం కింద పట్టుబడితే- తండ్రి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళిన బలమైన దృశ్యాన్ని కొంతవరకూ తనికెళ్ళ భరణి నటన బ్రతికించింది కానీ దర్శకుడు కాజువల్‌గా తీసుకున్నట్లనిపిస్తుంది. కామెడీ సీన్లు చాలావరకూ బాగున్నా, కొన్నింటిలో శాడిజం- విసుగనిపించేటంత రిపిటీటివ్. హీరో పాత్రలో విలక్షణత ఉంది కానీ మనస్తత్వప రంగా లోతులు చేరలేదు. అతడిలో వచ్చిన మార్పుకి కారణం- సినిమా ముగించాలన్న తొందర అనిపిస్తుం ది. 'ఆర్య', 'నువ్వే నువ్వే'- స్థాయిలో సన్నివేశాలు కల్పించుకుని- ఇంటర్వెల్‌కి ముందూ వెనకా ప్రేక్షకుల్ని ఉక్కిరిబిక్కిరి చేయాల్సిన చిత్రమిది. ఐతే బలహీనమైన కథని (తనదే ఐనా) కూడా మరీ అనాసక్తం అని పించని విధంగా చిత్రీకరించిన సూర్యప్రతాప్‌కి భవిష్యత్తుందనిపిస్తుంది. స్పార్కులూ, థ్రెడ్సూ, లైన్లూ- అన్ని సినిమా కథలకూ తోడ్పడవు. మంచి కథకు అనుభవజ్ఞులైన కథారచయితల సహకారం అవసరం. అది గ్రహించకపోవడంవల్ల ప్రతిష్ఠాత్మక దర్శకుల చిత్రాలే బాక్సాఫీస్ దగ్గిర తరచుగా చతికిలబడుతున్న రోజులివి. యువ దర్శకులు ఆరంభంలోనే కథకు ప్రాధాన్యమివ్వకపోవడం దురదృష్టం. ఇంటర్వెల్ దాకా ఫరవాలేదనిపించిన ఈ చిత్రం- ఆ తర్వాత కొంత నత్త నడక నడిచింది. మళ్ళీ పుంజుకుంటోందా అనుకునే టంతలో హఠాత్తుగా సినిమా ఐపోతుంది. సినిమా నచ్చనివారికి రిలీఫ్, అప్పటికీ ఇంకా ఆశ పెట్టుకున్నవా రికి నిరుత్సాహం. ఇక హీరోయిన్- తండ్రి నిర్ణయించిన వరుడు తాళి కట్టబోయే సమయంలో హఠాత్తుగా హీరోని పెళ్ళి చేసుకోవాలనుకోవడంలో- తన గురించే తప్ప- ఎదుటివారి గురించి ఏ మాత్రం ఆలోచించని స్వార్థపరురాలనిపిస్తుంది. సినిమాలో సమర్థనీయమేమో కానీ- ఆ చర్యని బయటివారెవరూ హర్షించరు. సృజనాత్మకతను ప్రదర్శించాలనుకునే కొత్త దర్శకులు ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయమిది. ఈ చిత్రంలో ఫైటింగ్స్ చిత్రీకరణ కొత్తగానూ, ఆసక్తికరంగానూ ఉండడం అభినందనీయం.

**సంభాషణలు:** కొన్నిచోట్ల చిత్రానికి అసెట్ అనిపిస్తాయి. మొత్తంమీద బాగున్నాయి.

**సుశాంత్:** తుషార్ కపూర్ పోలికలు కనిపించాయి. నటనలో ఎమ్రాన్ హష్మీ, అల్లు అర్జున్, పవన్ కళ్యా

ణ్‌ల పోకడలు కనిపించినా అనుకరించినట్లు అనిపించదు. ఆద్యంతం పాత్రోచిత నటనను ప్రదర్శించినా- ఎమోషనల్ సీన్లలో- నటన, డైలాగ్ డెలివరీ కూడా పేలవం. డాన్సుల్లో హుషారు. ఎనర్జీలో మాత్రం అల్లు అర్జున్ స్థాయికి ఇంకా ఆమడ దూరం.

**స్నేహ ఉల్లాల్:** నటన కృత్రిమంగాఉండి- వినిపించే గొంతుకి అనుగుణంగా తోచదు. అక్కడక్కడ హీరోకి అక్కలా ఉంది. పాటల్లో అవసరానికి మించి విజృంభించింది. మొత్తంమీద 'ఉల్లాసంగా ఉత్సాహంగా' అని పించదు.

**ఇతర నటీనటులు:** తనికెళ్ళ భరణి- పాత్ర నాట్ కన్విన్సింగ్- నటన గ్రేట్. చరణ్‌రాజ్- పాత్ర, నటన నాట్ కన్విన్సింగ్. బ్రహ్మానందం ఠీక్ హై. షఫీ ఠీక్ నహీ. కామెడీలో వెన్నెల కిశోర్ న్యూ ఫ్రెండ్. రఘుబాబుది గుర్తుండిపోయే నటన. ఇతర పాత్రధారులు అవధుల మేరకు పాత్రలకు న్యాయం చేసారు.

**పాటలు:** సినిమా చూస్తూండగానే అలరిస్తాయి. మళ్ళీమళ్ళీ వినాలనిపించే ఈ పాటల్లోని- కరెంట్ యువ తకే కాదు అందరికీ ఎనర్జీ ఇస్తుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ఈ చిత్రానికి అసెట్ కాగలదు.

**ప్రేక్షకులు:** కొందరు మధ్యలో హాల్లోంచి లేచి వెళ్ళిపోతున్నారు. వారి సంఖ్య క్రమంగా పెరగదని ఆశిద్దాం.

**ఆశావాదం:** భవిష్యత్తున్న హీరో, దర్శకుడు, కమేడియన్ ఈ చిత్రంలో పరిచయమయ్యారు. వారు తమ లోపాల్ని గుర్తించి సవరించుకుంటే తెలుగులో మరిన్ని మంచి చిత్రాల నిర్మాణానికి దోహదం చేయగలరు.